క్లుప్తంగా

ముక్కంటి ఆలయ పాలక మండలి సమావేశం రేపు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి సమావేశంలో సోమవారం ఉదయం 11గంటలకు ఆలయ పరిపాలన భవనంలో సమావేశం నిర్వహించనున్నామని ఈఓ సాగర్ బాబు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

నేడు రామగిరిలో అష్టమి పూజలు

పిచ్చాటూరు: మండలంలో రామగిరిలోని శ్రీ సంతాన కాలభైరవ స్వామి ఆలయంలో ఆదివారం అష్టమి పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ లత తెలిపారు. పల్లవుల కాలం నాటి ఈ ఆలయంలో క్షేత్ర పాలకునిగా కొలువుదీరిన కాలభైరవ స్వామికి ఉదయం అభిషేక పూజలు అనంతరం భక్తులకు దర్శనానికి అనుమతిస్తామని, భక్తులు నేతిదీపాలు వెలిగించడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆమె చెప్పారు.

ఉచిత పశువైద్య శిబిరానికి స్పందన


వైద్యం చేస్తున్న పశు వైద్యాధికారి స్రవంతి

రేణిగుంట: మండలంలోని కరకంబాడి పంచాయతీ గొల్లపల్లెలో శనివారం పశుసంవర్థక శాఖ, రాస్ మహిళా జ్యోతి మ్యూచువల్ ఫండ్ సంయుక్తంగా నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. మండల పశువైద్యాధికారి స్రవంతి ఆవులు, గేదెలు, దూడలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పాడి రైతులు జాగ్రత్త వహించాలని ఆమె సూచించారు. పశువులకు పిడుదుల నివారణ మందు పిచికారీ చేశారు. కార్యక్రమంలో క్లస్టర్ ట్రస్టీ సుబ్బరత్నమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాథమిక విద్యకు ఆలయాలు అంగన్‌వాడీ కేంద్రాలు


జనభగీ దారి ర్యాలీ ప్రారంభిస్తున్న సర్పంచ్ మంజుల

సత్యవేడు: మూడేళ్లు నిండిన పిల్లలకు విద్యలో గట్టి పునాదులు వేస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలు దేవాలయాలు వంటివని సర్పంచ్ మంజుల అన్నారు. శనివారం దళవాయి అగ్రహారం అంగన్‌వాడీ కేంద్రంలో జన భగీదారి ర్యాలీని సర్పంచ్ ప్రారంభించి ఆమె మాట్లాడారు. ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటలు, పీ1, పీ2 పుస్తకాల ద్వారా పిల్లలను ఆకర్షించే రీతిలో విద్యాబోధన చేస్తుండడంతో చిన్నారులు కేంద్రాలకు సంతోషంగా వస్తున్నారన్నారు. ప్రభుత్వం పిల్లలకు అవసరమైన కిట్లు, ఆట వస్తువులు సమకూర్చడంతో అంగన్‌వాడీ కేంద్రాలు పిల్లలతో కళకళలాడుతున్నాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు రమేష్, అంగన్‌వాడీ కార్యకర్త అనూరాధ, ఆయా సుగుణ, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దేవాలయాలు ఆధ్యాత్మిక ఉద్దీపన కేంద్రాలు


మందిరం ప్రారంభోత్సవంలో పవిత్రారెడ్డి, గ్రామస్తులు

తొట్టంబేడు (శ్రీకాళహస్తి): గ్రామాల్లో దేవాలయాలు భగవంతుని పట్ల భక్తి, ఆధ్యాత్మిక ఉద్దీపనకు కేంద్రాలని తొట్టంబేడు మండల వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బియ్యపు పవిత్రారెడ్డి అన్నారు. మండలంలోని చిన్నకనపర్తి దళితవాడలో నూతనంగా నిర్మించిన రామమందిరంలో శనివారం శ్రీ సీతారామచంద్ర, లక్ష్మణ, హనుంత చిత్రపటం ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గోపి, ఎంపీటీసీ సుబ్రమణ్యం, మణినాయుడు, చంద్రయ్యనాయుడు, నరసింహనాయుడు, సురేష్, చంద్ర, సుబ్రమణ్యం, రాధ, భక్తులు పాల్గొన్నారు.

కార్గో జిల్లా అధికారిగా సురేంద్రబాబు



తిరుపతి అర్బన్: ఆర్టీసీ తిరుపతి జిల్లా కార్గో అధికారిగా సురేంద్రబాబు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ప్రకాశం జిల్లా నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న జీఎల్‌పీవీ సుబ్బారావు పశ్చిమ గోదావరి జిల్లాకు బదిలీ అయ్యారు. ఆర్టీసీ కార్గో అధికారులు శనివారం జీఎల్‌పీవీ సుబ్బారావుకు వీడ్కోలు పలుకుతూ సురేంద్రబాబుకు స్వాగతం పలికారు.

రామాలయంలో అన్నదానం

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరిలోని టీటీడీ అనుబంధ కోదండ రామాలయంలో శనివారం దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని ఆలయాల డిప్యూటీ ఈఓ దేవేంద్రబాబు ప్రారంభించారు. ప్రతి శనివారం స్వామివారి భక్తులకు అన్నదానం చేయాలని నిర్ణయించామన్నారు.

ఆర్బీకేలు.. రైతు నేస్తాలు



పులికుండ్రంలోని రైతు భరోసా కేంద్రం

అన్నదాతలు విత్తనాలు, ఎరువుల కోసం మండల కేంద్రానికి వచ్చి క్యూలో గంటల తరబడి పడిగాపులు కాసే పరిస్థితి తెలుగుదేశం పాలనలో ఉండేది. శ్రమలకోర్చి పంటలు పండించినా గిట్టుబాటు ధర లభించక దళారుల పాలయ్యేది. మరోవైపు సబ్సిడీ వ్యవసాయ పనిముట్లు, యంత్రాలను రైతుల పేరిట టీడీపీ నేతలో స్వాహా చేశారు. అయితే వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. రైతు భరోసా కేంద్రాల ఏర్పాటుతో విత్తనాల మొదలు ఎరువులు, వ్యవసాయ పనిముట్లు, యంత్రాలు అన్నీనూ రైతుల ముంగిటకే చేరుస్తోంది. ఫలితంగా వ్యవసాయ రంగం బలోపేతమవుతోంది.

- రైతులకు పలు సేవలు
- విత్తనాల పంపిణీ మొదలు వ్యవసాయ ఉత్పత్తుల విక్రయం వరకు అండ

పిచ్చాటూరు: మండలంలో మొత్తం 10 రైతు భరోసా కేంద్రాలు ఉన్నాయి. టీడీపీ పాలనలో మండల కేంద్రానికే పరిమితమైన వ్యవసాయ, ఉద్యానవన, పశు సంవర్ధక శాఖ సేవలు ఆర్బీకేల ద్వారా గ్రామ స్థాయికి విస్తరించింది. రైతులకు సాంకేతిక బదలాయింపు, దిగుబడుల నాణ్యత పెంపు, ఆధునిక పరికరాల వినియోగం రాయితీపై ఎరువులు–విత్తనాలు, రసాయన రహిత సేద్యం, రాయితీ పరికరాలు, పంటల బీమా.. ఇవన్నీ అన్నదాతకు చేదోడుగా మారాయి. దుక్కి తయారీ నుంచి పంటల విక్రయం వరకు అన్ని స్థాయిలోనూ రైతుకు అండగా నిలుస్తున్నాయి. వ్యవసాయ సలహా మండలి ఏర్పాటుతో స్థానిక పరిస్థితులకు అవసరమైన విత్తనాలు, పరికరాలను ఆర్బీకేలు సమకూర్చుకుంటున్నాయి. సేవలతో ఇవి బహుళ ప్రయోజనాల కేంద్రాలుగా ఉండడంతో వీటిపై అధ్యయనం చేసిన కేరళ, తమిళనాడు రాష్ట్రాలు ఇవే తరహా కేంద్రాలు ఏర్పాటుకు సమాయత్తం అవుతున్నాయి.


కారూరు ఆర్‌బీకేలో రైతులకు పంపిణీ చేసిన ట్రాక్టర్లు, వ్యవసాయ పనిముట్లు(ఫైల్)

కియోస్కలతో ఆర్డర్

వైఎస్ఆర్ రైతు భరోసా కేంద్రాలలో ఆధునిక కియోస్కల ద్వారా అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను రైతులకు ముందుగానే ఆర్డర్ చేసి తెప్పించుకోవచ్చు. ఈ–క్రాప్ నమోదు, పంటల బీమా, రాయితీ పథకాలు అందుకోవడానికి బయోమెట్రిక్ పరికరాలు ఉపయోగపడుతున్నాయి.

డిజిటల్ లైబ్రరీలు

ఆర్‌బీకేలలో టీవీలను ఏర్పాటు చేసి వివిధ పంటల సాగుపై నిపుణులు, అనుభవజ్ఞులైన రైతులతో రూపొందించిన వీడియోలు అందుబాటులో ఉంచారు. దీనితో పాటు పంటల వారీగా దుక్కులు సిద్ధం చేయడం మొదలు పంట నూర్పిడి వరకు రైతులకు కావాల్సిన సమగ్ర సమాచారంతో సిద్ధం చేసిన పుస్తకాలను లైబ్రరీలో పెట్టారు. ఫోన్ ద్వారా రైతుల సందేహాలను నివృత్తి చేయడానికి కార్యాలయ పనివేళల్లో ఉన్నత అధికారులు అందుబాటులో ఉంటున్నారు.

మండలంలో ఆర్బీకేలతో అందిస్తున్న సేవలు

మల్టీ ఫంక్షనల్ కియోస్కలు :	10
సేవలు పొందుతున్న రైతులు :	3,250
పంపిణీ చేసిన ఎరువులు :	412 మెట్రిక్ టన్నులు
పురుగు మందులు :	76 లీటర్లు
విత్తనాలు :	11,496.2 క్వింటాళ్లు
కస్టమ్ హైరింగ్ కేంద్రాలు :	10
పంపిణీ చేసిన యంత్ర సేవ ట్రాక్టర్లు :	04
పంపిణీ చేసిన కౌలు రైతుల గుర్తింపు కార్డులు :	23
రైతుభరోసా–పీఎం కిసాన్ పంపిణీ మొత్తం :	రూ.25.18 కోట్లు
ధాన్యం కొనుగోలు (సజ్జ, వేరుశెనగ) :	5,409 క్వింటాళ్లు
పొలంబడి కార్యక్రమాలు :	6
రైతు భరోసా మాసపత్రికలు :	150
రైతులకు ఈ–క్రాప్ నమోదు :	4,572 మంది 7,642 ఎకరాలు
సున్నావడ్డీ పంట రుణాలు :	రూ.45.47 లక్షలు

వ్యవసాయానికి చేయూత


మట్టి నమూనా, భూసార పరీక్షల నుంచి పంట విక్రయం వరకు రైతు భరోసా కేంద్రాలు వ్యవసాయానికి చేయూతనిస్తున్నాయి. గతంలో ఇలాంటి సేవలు మండల కేంద్రంలోని రైతులకు అరకొరగా అందేవి. ఆర్‌బీకేల ఏర్పాటు వల్ల గ్రామీణ రైతుల చెంతకే పలు సేవలు అందుతున్నాయి.
– తిరుమల రెడ్డి, రైతు, పిచ్చాటూరు

పడిగాపులకు స్వస్తి


మండల కేంద్రానికి వెళ్లి గంటలు, రోజులు తరబడి క్యూలలో పడిగాపులు కాసి చివరికి విత్తనాలు, ఎరువులు పొందలేక వెనుదిరిగిన రోజులు గతంలో ఎన్నో ఉన్నాయి. ఆర్‌బీకేల ఏర్పాటుతో ఈ బాధలు తప్పాయి. వీటిని ఏర్పాటు చేసిన సీఎం జగనన్నకు రుణపడి ఉంటాం.
– గంగాధరం రెడ్డి, రైతు, పిచ్చాటూరు

దళారుల బెడద తగ్గింది


రైతు భరోసా కేంద్రాల వల్ల ప్రస్తుతం దళారుల బెడద దాదాపు తగ్గింది. ఆర్‌బీకేల ద్వారా పంటలను కొనుగోలు చేయడం.. మాలాంటి అన్నదాతలకు విత్తనాలు, పురుగు మందులు, పనిముట్లు వంటివి కోసం ప్రైవేటు వ్యక్తులను ఆశ్రయించే బాధ తప్పింది. ఆర్బీకేలలోనే పొందుతున్నాం.
– వాసు రెడ్డి, రైతు, అప్పంబట్టు

సేవలు విస్తృతం


ఆర్బీకేలతో రైతన్నలకు విస్తృత సేవలందిస్తున్నాం. విత్తనాలు, ఎరువులు, పంట విక్రయంతో పాటు ఉద్యానవనం, పశుసంవర్ధక, మత్స్యసంపదపై సేవలు అందిస్తున్నాం. రైతులు ఉత్సాహంగా సేవలను సద్వినియోగం చేసుకుంటున్నారు.
– సంజీవ రెడ్డి, వ్యవసాయ అధికారి, పిచ్చాటూరు

శిక్షణతో విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి


వర్చువల్ విధానంలో మాట్లాడుతున్న పోలా భాస్కర్

శ్రీకాళహస్తి: డిగ్రీ కళాశాలల అధ్యాపకులు ఇంగ్లిష్ మీడియం బోధనపై శిక్షణతో నైపుణ్యాలు పెంపొందించుకుని విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ విద్యా కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్ మార్గదర్శనం చేశారు. శనివారం ఆయన వర్చువల్ విధానంలో అన్ని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ, అధ్యాపకులందరూ ఈ శిక్షణ ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఇంగ్లీష్ మీడియం బోధనలో దేశంలోనే ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. అనంతరం శ్రీకాళహస్తి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నాగరాజునాయుడు మాట్లాడుతూ, నోడల్ రిసోర్స్ సెంటర్ అయిన స్థానిక శ్రీ విద్యాప్రకాశనంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 8 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు చెందిన 50మంది అధ్యాపకులకు మొదటి విడత జూన్ 5 నుంచి 10వ తేదీ వరకు దేశంలోని వివిధ ప్రాంతాల్లోని నిపుణులతో ఆన్‌లైన్‌లో ఇంగ్లీష్ మీడియం బోధనా నైపుణ్యాలు, ఇతర అంశాలపై శిక్షణ ఇచ్చామన్నారు. రెండవ విడత జూన్ 12 నుంచి 17 వరకు, మూడవ విడత జూన్ 19 నుంచి 24వ తేదీ వరకు ఉంటుందన్నారు.

ఈ శిక్షణా కార్యక్రమాలకు సమన్వయకర్తగా కళాశాల అధ్యాపకులు డాక్టర్ నరసింహవర్మ వ్యవహరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో నోడల్ రిసోర్స్ సెంటర్ సమన్వయకర్త డాక్టర్ నరసింహవర్మ, డాక్టర్ గంగారాం, సతీష్, గిరిజమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా అవసరాలకు ట్రాక్టర్ వితరణ


లోకా ఫౌండేషన్ వితరణగా అందజేసిన ట్రాక్టర్

వరదయ్యపాళెం: మండలంలోని కాంబాకం పంచాయతీ కృష్ణాపురం గ్రామానికి లోకా ఫౌండేషన్ స్థానిక ప్రజా అవసరాల కోసం ట్రాక్టర్‌ను వితరణగా అందజేసింది. ఇప్పటికే లోకా ఫౌండేషన్ ఆ గ్రామాన్ని దత్తత తీసుకుని పలు అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించింది. ఇందులో భాగంగా శనివారం లోకా ఫౌండేషన్ ప్రతినిధి ఆచార్య ఆనందగిరిజీ, జాన్ డీర్ కంపెనీకి చెందిన ట్రాక్టర్‌ను వితరణగా అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామ అవసరాల కోసం ట్రాక్టర్‌ను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో జాన్ డీర్ కంపెనీ జనరల్ మేనేజర్ చౌదరి, సర్పంచ్ దీప, మాజీ ఎంపీపీ పోలయ్య, లోకా ఫౌండేషన్ జనరల్ మేనేజర్ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో శివమణి


ఆలయ ధ్వజస్తంభం వద్ద డ్రమ్స్ శివమణి

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని శనివారం ప్రముఖ డ్రమ్స్ వాయిద్యకారుడు శివమణి దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికారు. దర్శనానంతరం గురుదక్షిణా మూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం పలికారు. స్వామి అమ్మవార్ల జాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

పాఠశాలలకు ‘విద్యా కానుక’

- స్టాక్ పాయింట్ నుంచి సరఫరా
- స్కూళ్ల ప్రారంభం రోజునే పంపిణీకి చర్యలు


వరదయ్యపాళెం మండలంలో పాఠశాలలకు చేరుకున్న జేవీకే కిట్లు

వరదయ్యపాళెం: మరో 2 రోజుల్లో పాఠశాలలు పునః ప్రారంభం కానున్నాయి. దాని కంటే ముందుగానే జగనన్న విద్యాకానుక కిట్లు ఆయా పాఠశాలలకు చేరుతున్నాయి. స్కూలు తెరచిన రోజునే వాటిని విద్యార్థులకు అందజేయనున్నారు. మండలంలో విద్యాశాఖ అధికారులు జగనన్న విద్యాకానుక విద్యార్థులకు అందించే ప్రక్రియను దాదాపుగా పూర్తి చేశారు.

పర్యవేక్షణ

మండలంలో 69 స్కూళ్లకు జగనన్న విద్యాకానుక కిట్లను పంపిణీ చేశారు. ఈ పాఠశాలల్లో ఒకటి నుంచి పదో తరగతి వరకు 4,396 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరందరికీ జేవీకే కిట్లు పంపిణీ చేయనున్నారు. ఇందు కోసం వరదయ్యపాళెం హైస్కూల్‌లో స్టాక్ పాయింట్‌ను ఏర్పాటు చేశారు. జగనన్న విద్యాకానుక అయిన బ్యాగ్, యూనిఫాం, పుస్తకాలు, నోట్ బుక్స్, బూట్లు, సాక్స్, బెల్టు, టైలను స్టాక్ పాయింట్ వద్ద విద్యాశాఖ అధికారులు స్కూల్ హెచ్ఎం పర్యవేక్షణలో జేవీకే కిట్‌గా సిద్ధం చేశారు. కిట్ల నాణ్యతను ఇప్పటికే పరిశీలించారు.

నాణ్యమైన కిట్లు అందేలా ఏర్పాట్లు


మండల వ్యాప్తంగా అన్ని పాఠశాలలకు పూర్తిస్థాయిలో జేవీకే కిట్లు చేర్చుతున్నాం. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని నాణ్యమైన కిట్లనే విద్యార్థులకు అందించేలా ఏర్పాట్లు చేశాం. మాతో పాటు ఉపాధ్యాయులు, పర్యవేక్షణ కమిటీ సహకారంతో అన్ని ఏర్పాట్లు చేశాం.
– సరస్వతి, ఎంఈఓ, వరదయ్యపాళెం మండలం

హడలెత్తించిన జీపు


ప్రమాదానికి కారణమైన జీపు


జీపు డ్రైవర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

- మద్యం మత్తులో డ్రైవర్ హల్‌చల్
- ఆటోలను, పెళ్లి బృందం కారును ఢీకొన్న వైనం
- బెలూన్ తెరచుకోవడంతో నవ వధూవరులకు తప్పిన ప్రమాదం
- పెళ్లి కుమార్తె తల్లి, బాలుడు, ఆటోడ్రైవర్‌కు గాయాలు


దెబ్బతిన్న పెళ్లి బృందం కారు

శ్రీకాళహస్తి: ఓ జీపు జనాన్ని హడలెత్తించిన సంఘటన శ్రీకాళహస్తిలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. ఓ యువకుడు మద్యం సేవించి వీఎంసీ కూడలి నుంచి జీపును నడుపుకుంటూ హల్‌చల్ చేశాడు. ఆర్టీసీ బస్టాండు వద్ద ఓ ఆటోను ఢీకొన్నాడు. అక్కడి నుంచి తెట్టు కూడలి వద్ద ఓ పెళ్లి బృందం కారును ఢీకొన్నాడు. అయితే కారులో బెలూన్ తెరచుకోవడంతో చెంబేడుకు చెందిన పెళ్లికుమారుడు, పెళ్లికుమార్తె ప్రమాదం నుంచి బైటపడ్డారు. అయితే ఈ ప్రమాదంలో పెళ్లికుమార్తె తల్లి, బాలుడు స్వల్పంగా గాయపడ్డారు. వారిని స్థానికంగా ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అలాగే పెళ్లి బృందం కారును ఢీకొన్న అనంతరం అక్కడే ఉన్న ఓ ఆటోను జీపు ఢీకొనడంతో అది బోల్తా పడింది. అందులో ఉన్న డ్రైవర్ గణేష్‌కు స్వల్పగాయాలయ్యాయి. అతడిని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సమాచారం అందుకున్న రెండవ పట్టణ ఎస్ఐ మహేష్‌బాబు ఘటనా స్థలానికిచేరుకుని ప్రమాదంపై ఆరా తీశారు. ప్రమాదానికి కారకుడైన జీపు డ్రైవర్ మణి(23)ని అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇతడు తిరుపతి రూరల్ మండలం మంగళం వాసి అని పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది.

జగనన్నతోనే సంక్షేమం


చిన్నారిని ఎత్తుకుని లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే పేదప్రజల సంక్షేమం సాధ్యమని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని చల్లపాళం సచివాలయ పరిధిలో చటర్జీనగర్, చల్లపాళెం దళితవాడ, అరుంధతివాడలో శనివారం ఆయన పర్యటించారు. ప్రతి లబ్ధిదారుకుని ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను ఆయన వివరించారు. సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దుష్ట చతుష్టయం ఎన్ని కుట్రలు పన్నినా, 2024లో ఎన్నికల్లో కూడా ప్రజలు తమ పార్టీకే పట్టంకడతారని పేర్కొన్నారు. వైఎస్ఆర్‌సీపీ నాయకులు రామచంద్రయ్య, భాస్కరయ్య, రమణయ్య, చిరంజీవులు, ధనంజయులు, వెంకటేష్, వేణు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాలతో గ్రామ స్వరాజ్యం



సచివాలయ ఉద్యోగులు, పార్టీ నాయకులతో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

–ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

ఏర్పేడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను ప్రవేశ పెట్టి గాంధీ కలలు గన్న గ్రామస్వరాజ్య స్థాపన తీసుకొచ్చినట్లు ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండలంలోని అంజిమేడులో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ను శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. రూ.40 లక్షలతో గ్రామ సచివాలయం, రూ.17.5 లక్షలతో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ను అద్భుతంగా నిర్మించారని కితాబిచ్చారు. ప్రజా సమస్యలను పరిష్కరించడానికి అన్ని శాఖల అధికారులను ఆయా గ్రామ సచివాలయాల పరిధిలో ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. వైఎస్సార్ హెల్త్ సెంటర్లను ఏర్పాటు చేసి గ్రామంలో మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నట్లు చెప్పారు. పేదల అభ్యున్నతే జగనన్న ధ్యేయమని చెప్పారు. కార్యక్రమంలో బియ్యపు పవిత్రారెడ్డి, మండల వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి, యువజన విభాగం రాష్ట్ర నాయకుడు కన్నలి మోహన్‌రెడ్డి, సర్పంచ్ తాతేకాల్వ మోహన్‌రెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాసులు, ఎంపీపీ గీత, వైస్ ఎంపీపీలు జమ్మల శ్రీనివాసులు, జనార్ధన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గురవారెడ్డి, ఉపాధ్యక్షుడు రాజారెడ్డి, నాయకులు తాతేకాల్వ శంకర్‌రెడ్డి, లోకనాథరెడ్డి, భాస్కర్‌రెడ్డి, వెంకట నారాయణరెడ్డి, బాల గురునాధంరెడ్డి, మహదేవరెడ్డి, పంచాయతీ కార్యదర్శి గోవిందయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గంగమ్మ జాతర



అలంకరణలో గంగమ్మ, పొంగలి వండుతున్న మహిళలు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని నీర్పాకోటలో మైక్రోవేవ్ స్టేషన్ కాలనీలోని గ్రామదేవత గంగమ్మకు శనివారం కాలనీవాసులు ప్రత్యేక పూజలు చేసి, పొంగళ్లు పెట్టి, ఘనంగా జాతర నిర్వహించారు. గంగమ్మ విగ్రహానికి అభిషేకాలు చేసి, ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు. అనంతరం అంబలి పోసి మొక్కులు చెల్లించారు. దేవాలయ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

యోగా గురువుకు సన్మానం


యోగా గురువు మార్కండేయులును సన్మానిస్తున్న శిష్యులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని శుకబ్రహ్మాశ్రమ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యోగ కేంద్రం గురువు మార్కండేయులును శనివారం శిష్య బృందం సన్మానించింది. వారు మాట్లాడు తూ, శుకబ్రహ్మాశ్రమం ఆధ్వర్యంలో ప్రతిరోజూ నిర్వహించే ఉచిత యోగ శిక్షణలో సుమా రు 1,600మందికి యోగా నేర్పించారన్నారు. అంతే కాకుండా విద్యార్థులకు ఉచితంగా భగవద్గీత నేర్పిస్తారని, ఈ నేపథ్యంలో ఆయన జన్మదినం పురస్కరించుకుని సన్మానించినట్లు చెప్పారు.